మేనిఫెస్టో పక్కాగా అమలు సీఎం జగన్ ఘనతే

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 101వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం


వృద్ధురాలికి పథకాల లబ్ధి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, కార్పొరేటర్

ఏలూరు టౌన్: మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసి చూపిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని, తాను చేసింది నచ్చితేనే ఓటేయండని చెప్పేదమ్ము జగన్‌కే ఉందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 101వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన 36వ డివిజన్ చేపలతూము సెంటర్ ప్రాంతంలో ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమవరపు సురేష్ ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే నాని ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఆరా తీశారు. పింఛన్ సకాలంలో అందుతుందా అవ్వా తాతా.. అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ అందాయా అమ్మా?. అంటూ అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సాంకేతిక కారణాలతో పథకాలకు దూరమైతే సమస్యలను పరిష్కరించి అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీలనీ పక్కాగా అమలు చేసి చూపించారని చెప్పారు. గతంలో టీడీపీ చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా పనిచేసినా తనది చెప్పుకునే ఒక్క పథకమైనా ఉందా? అని ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటనలు చేస్తూ సీఎం జగనన్నను తిట్టటమే పనిగా పెట్టుకున్నారు తప్ప.. తాము ఏమి చేస్తామో చెప్పే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. లోకేష్ చేస్తోన్న పాదయాత్రకు జనం నుంచి స్పందన లేకపోవటంతో ఏమి చేయాలో తెలియక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని విమర్శించారు. టీడీపీ నేతల మాటలను జనం పట్టించుకోవటంలేదని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేదలకు మేలు చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ఎమ్మెల్యే నాని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, మాజీ కార్పొరేటర్ బందారు కిరణ్‌కుమార్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, గరికిముక్కు జయకర్, దేవరకొండ శ్రీనివాస్, నాయకులు తోట సుధీర్, ఆర్జి నాగేశ్వరరావు, జనపరెడ్డి కృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మాదేపల్లిలో ఎన్‌రోల్ డ్రైవ్


ఎన్‌రోల్ డ్రైవ్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిఈడు పిల్లల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని మాదేపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమె పువ్వుల ఆంజనేయులు, తదితర ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో ఎన్‌రోల్ డ్రైవ్ చేపట్టామని పేర్కొన్నారు. గత మూడురోజుల నుంచి మాదేపల్లిలో ఇంటింటికీ వెళ్లి బడి బయటున్న పిల్లలను తరగతి గదులకు రప్పించి, వారికి చదువు పట్ల ఆసక్తి పెంచుతున్నామని తెలిపారు. ఎన్‌రోల్ డ్రైవ్ మంచి ఫలితాలు ఇస్తుందని ఆంజనేయులు పేర్కొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం పంపిణీ


సత్రంపాడులో మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్

ఏలూరు రూరల్: సత్రంపాడులో ఎన్టీఆర్ బొమ్మ వద్ద నాలుగురోడ్ల కూడలిలో గురువారం వాకర్స్ అసోసియేషన్ మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.ఆదినారాయణ, వైస్ ప్రెసిడింగ్ ఎ.శ్రీనివాసరావుతో పాటు కేఎస్ చంద్రశేఖర్, బిక్కాజి, బి.వెంకటేశ్వరరావు తదితర సభ్యులు పాదచారులు, ఆటో డ్రైవర్లకు మజ్జిగ అందించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ కేంద్రం ఏర్పాటుచేశామని సభ్యులు తెలిపారు.

21 నుంచి గంగానమ్మ జాతర

కొయ్యలగూడెం : పొంగుటూరులో గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారికి ఈనెల 21 నుంచి జూన్ 4 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పక్షం రోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు ఉత్సవ, ఊరేగింపుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనంతరం అమ్మవారికి జాతర నిర్వహిస్తుండడంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ 3వ తేదీ రాత్రి అఘం(బలిచేట ప్రదక్షణలు) మరుసటి రోజు ఆదివారం గ్రామస్తులు సామూహికంగా బంధుమిత్రులకు అమ్మవారి నైవేద్య ప్రసాదాలను విందుగా అందించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు మెయిన్ రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ దీపాలంకరణ పనులు కొనసాగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


నగరపాలక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతతో కృషి చేయాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ మారుతోన్న జీవన శైలికి అనుగుణంగా కాలుష్యం తీవ్రస్థాయికి చేరిందన్నారు. నీటి, వాయు కాలుష్యాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన గాలి, నీరు అందించేందుకు ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈనెల 18 నుంచి 15 రోజుల పాటు పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుతామని నినదిస్తూ నగరపాలక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంఈ భాస్కరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతీ, నగరపాలక ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మత రాజకీయాలను ఓడించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): దేశంలో మతరాజకీయాలను ఓడించడమే భారత్ బచావో లక్ష్యం అని భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగేశ్వరరావు అన్నారు. నాగేశ్వరరావు ఇంటి వద్ద గురువారం నిర్వహించిన భారత్ బచావో జిల్లా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశంలో మత రాజకీయాలకు వ్యతిరేకంగా ఏ రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా వర్క్ షాపులు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కర్ణాటకలో బీజేపీ ఓటమి వెనుక తమ సంస్థ పాత్ర ఎంతో ఉందన్నారు. ఒక ప్రత్యేక వెబ్ సైట్ ద్వారా కర్ణాటకలో విస్తృత ప్రచారం చేశామని, ఈ వెబ్‌సైట్‌లో 112 సంస్థలు పనిచేశాయని తెలిపారు. ఆరు నెలల పాటు ఐదువేల మంది కార్యకర్తలు 149 నియోజకవర్గాల్లో బీజేపీ మత రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేశాయని గుర్తుచేశారు.

భారత్ బచావో జిల్లా కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా గుబ్బల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కాపుదాసి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా పాము రవీంద్రనాథ్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా రేవుల గడ్డ హరికిరణ్ సింగ్, లీగల్ వ్యవహారాల కార్యదరిశగా గంటా రాజశేఖర్, మీడియా వ్యవహారాల కార్యదర్శిగా నూకపెయ్యి కార్తీక్, ప్రచార కార్యదర్శిగా మానుపాటి వసంత్ కుమార్, వైస్ చైర్మన్–2 గా భూక్యా రమేష్ నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా నంబూరి రవి కుమార్, కాట్రు బసవరాజులతో పాటు ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శాంతి నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి నగర్, ఫిరంగుల దిబ్బ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరౌతారని, సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొని అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చిస్తారని పేర్కొన్నారు.

మృతుడు.. చినకొట్టాడ వ్యక్తి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్ సమీపంలో బస్‌షెల్టర్‌లో బుధవారం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభించింది. మృతుడి కై కలూరు మండలం చినకొట్టాడ గ్రామానికి చెందిన సైదు మాణిక్యాలరావు (55)గా గురువారం ఏలూరు చేరుకున్న బంధువులు గుర్తించారు. మృతుడు భీమడోలులోని తమ బంధువులను చూసేందుకు వెళ్లే నిమిత్తం ప్రయాణమై అనారోగ్యం కారణంగా ఆశ్రం ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని, బస్‌షెల్టర్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఎండ వేడిమితో తీవ్ర అనారోగ్యానికి గురైన మాణిక్యాలరావు మృతిచెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మతిస్థిమితం లేని మహిళకు ఐసీడీఎస్ ఆశ్రయం


మతి స్థిమితంలేని మహిళ, రెస్క్యూ అనంతరం

ఏలూరు (టూటౌన్): మతి స్థిమితం లేని మహిళను స్త్రీ, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు చేరదీసి ఓయస్సీలో ఉంచారు. ఐసీడీఎస్ ఆర్‌జేడీ కె.ఉమారాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ దగ్గరలో మతి స్థిమితం లేని మహిళ సంచరిస్తున్నట్టు ఆర్‌జేడీకి సమాచారం వచ్చింది. ఆర్‌జేడీ ఆదేశాలతో పీడీ ఆఫీస్ నోడల్ అధికారి ఎ.లలిత, డీసీపీయూ సిబ్బంది ఆర్ రాజేష్, డీసీపీఓ సూర్య చక్రవేణి, ఓఎస్‌సీ సిబ్బంది నిర్మల, శాంత, వేద, రాణి కలిసి మతి స్థిమితం లేని మహిళను రెస్క్యూచేసి ఓఎస్‌సీకి తీసుకొచ్చారు. మహిళ జుట్టు కత్తిరించి, స్నానం చేయించి, బట్టలు మార్చారు. తన పేరు అమల అని ఊరు చీపురుపల్లి, నారాయణ టీచర్ అని మాత్రమే చెబుతోంది. రెస్క్యూ చేసిన మహిళను స్వగ్రామంలోని బంధువుల వద్దకు చేర్చేందుకు కృషి చేస్తున్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

ఉంగుటూరు : నీలాద్రిపురంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సీహెచ్ఎస్‌వీ కొండలరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు, సీతారాం, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మూర్తి, నీలాద్రిపురం, జీఎంఎస్‌కే సునీతారాణి పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి


మాదేపల్లి శివారు తమ్మిలేరు వద్ద నినదిస్తున్న కూలీలు

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస వసతులు కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాదేపల్లి శివారు తమ్మిలేరులో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెండు పూటల పని విధానం, నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం వల్ల కూలీలు నానా అగచాట్లుకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫొటో యాప్ విధానం వల్ల నెట్ సౌకర్యం లేని చోట్ల కూలీలు ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారని వివరించారు. ఆన్‌లైన్ సమస్య తక్షణం పరిష్కరించాలని కోరారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు, రూ.600 కనీస వేతనంతో పాటు బడ్జెట్‌లో ఈ పథకానికి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో ఉపాధి హామీ చట్టం

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని, చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. కోట్లాది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టడానికి తెచ్చిన ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటల పనిని తీసుకొచ్చిందని ఆరోపించారు. దీంతో ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని ఎత్తివేయడానికి బీజేపీ చేసిన అనేక కుట్రలలో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషికం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు చేస్తుందని పేర్కొన్నారు. ఈ ఉపాధి హామీ పథకమే 2020 కరోనా సమయంలో పేదలు ఆకలి చావులు సంభవించకుండా కాపాడిందని గుర్తుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం బడ్జెట్లో రూ.30 వేల కోట్లు తగ్గించి ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టంను రద్దు చేయాలని, రెండు పూటల పనిని తీసివేయాలని, సమ్మర్ అలవెన్స్, పేస్లిప్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో ఆశ, ఏఎన్ఎంలను నియమించాలన్నారు. కుటుంబానికి 200 రోజులు పనిదినాలు, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని ఆయన కోరారు.

నూకాలమ్మకు సౌభాగ్య ద్రవ్యాలతో అభిషేకం



పూజా ద్రవ్యాలను తీసుకువస్తున్న భక్తులు, పసుపు కుంకుమలు, జలాలతో అభిషేకించిన అనంతరం నూకాలమ్మవారు →

జంగారెడ్డిగూడెం : పట్టణానికి ఉత్తరాన కొలువైయున్న చక్ర సహిత నూకాలమ్మ వారి ఆలయం నాల్గో వార్షిక వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం అమ్మవారు స్వర్ణవర్ణపూర్ణ కవచ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విరాట్‌కు మూలమంత్ర కళాహోమం, అష్టోత్తర శతకలశాలతో, సప్తనదీ పుష్కర జలాలతో విశేష సౌభాగ్య ద్రవ్యాలతో 108 మంది స్త్రీ మూర్తులచే అత్యంత వైభవోపేతంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యపూజా కైంకర్యాలు, నీరాజన మహామంత్ర పుష్పం చతుర్వేద స్వస్తి ఆలయ అర్చక స్వాముల బృందం జరిపారు. ఈరోజు అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు కారింగుల రామకృష్ణమూర్తి, శ్రీరామనాగరత్నం దంపతులు, వారి కుటుంబ సభ్యులు సహకారం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆధ్యాత్మిక సేవాప్రతినిధి తిప్పాభట్ల రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీవితంలో గణితానికి అధిక ప్రాధాన్యత

పెదపాడు : నిత్య జీవితంలో గణితానికి అత్యంత ప్రాముఖ్యత ఉందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కుకునూరి సీతారామకృష్ణారావు (రాంబాబు) తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు గణితం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సీతారామకృష్ణారావు మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితం లేకుండా ఏపని చేయడం సాధ్యం కాదన్నారు. ప్రతి ఒక్కరూ గణితం నేర్చుకోవాలన్నారు. ఒక వస్తువు కొనాలన్నా అమ్మాలన్నా, ఒక వస్తువు రవాణా చేయాలన్నా, తినాలన్నా, ఏ పనిచేసినా గణితంతో ముడిపడి ఉంటుందన్నారు. గణితం అంటే విద్యార్థులకు భయం ఉంటుందని, కానీ గణితం నేర్చుకోవడం చాలా సులభమని వివరించారు. అనంతరం డ్రాయింగ్‌పై శిక్షణ అందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు రాంబాబు, శ్రీకృష్ణ గురుకులం ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	07-10
బెండకాయలు	20	కంద	72
పచ్చిమిర్చి	48-56	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-48	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	232
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	08-12
దొండకాయలు	20	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	32

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఇస్త్రీ పెట్టె వితరణ


సత్యనారాయణకు ఇస్త్రీ పెట్టెను అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న రజక వృత్తిదారుడు పట్లచెరువు సత్యనారాయణకు రూ.6 వేలు విలువైన ఇస్త్రీ పెట్టెను అందజేశారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో గురువారం సాయంత్రం బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇస్త్రీ పెట్టెను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలందరూ ఒకరికి ఒకరు సహాయ సహకారాలను అందించుకుంటూ బీసీల ఐక్యతను చాటే విధంగా కార్యక్రమాల్ని ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జాతీయబీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, ఏలూరు నగర అధ్యక్షుడు బొట్టా అజయ్, బీసీ నాయకుడు మురాల లక్ష్మణరావు, సత్తెనపల్లి వెంకటేశ్వరరావు, మల్లిపూడి రాజు, చిలకంటి గంగాధర్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

21న ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

దెందులూరు : ఈనెల 21న దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం చేయనుంది. ఏపీ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి 20 మందితో కూడిన దెందులూరు ఏఎంసీ పాలకవర్గాన్ని నియమిస్తూ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీ ఒక సంవత్సరం పాటు అధికారంలో ఉంటుంది. చైర్మన్‌గా అప్పన కనకదుర్గాప్రసాద్, వైస్ చైర్మన్‌గా కాటి సుధాకర్, మెంబర్లుగా కంబంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొసరాజు రత్నకుమారి, దేవల రాజశేఖరరావు, నాగులపల్లి రంగారావు, పామర్తి నాగజ్యోతి, తోట హేమలత, బోడవరపు నళిని కుమారి, పులిపాటి శ్యామలాదేవి, కొండే జోజిలత, ఆవాల లీలావతి, కట్నేని తులసిరామ్, పసుపులేటి రాజేష్, పెదపాడు కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, గోపన్నపాలెం సర్పంచ్‌లను నూతన పాలక వర్గంగా నియమించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, హోం శాఖ మంత్రి తానేటి వనిత, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

పెదవేగి : అన్ని వర్గాల వారికీ సమన్యాయం చేసేందుకు తుది శ్వాసవరకు పోరాడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. వేగివాడ ఎమ్మార్పీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు.